కథా నిలయం
4649
శ్రీకాకుళం

# ఓ తాటిచెట్టు కథ



చాలామంది రచయితలు- ఇతరులు గుర్తించినా, గుర్తించకపోయినా... తాము చాలా గొప్ప రచయితలమనే స్థిరాభిప్రాయం కలిగివుంటారు. ఆ అభిప్రాయాన్ని తమతో మాట్లాడవచ్చిన వారి నెత్తిన- పిచ్చివాడి తలపై నిమ్మకాయచెక్క రుద్దినట్లు, రుద్దడానికి ప్రయత్నిస్తుంటారు. అలాంటివారిని చూస్తుంటే నవ్వూ వస్తుంది, జాలీ వేస్తుంది.

నాకు ఏ ఊరు వెళ్లినా, అక్కడి రచయితలను కలుసుకుని కాసేపు ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకోవడం ఒక హాబీలాంటి అలవాటు.

ఒకసారి నేను మద్రాసు వెళ్లాను. అక్కడ ఒక ప్రముఖ పత్రికలో ఉప సంపాదకుడుగా పనిచేస్తూ, అప్పుడప్పుడే పేరులోకి వస్తున్న ఒక నవ, యువ రచయితని కలుసుకొని నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

'ఎప్పుడొచ్చారు? ఎక్కడ దిగారు? ఎన్నాళ్ళుంటారు?' వంటి ప్రారంభప్రశ్నలు మూడు నాలుగు అయ్యాయో లేదో... ఆ రచయిత అకస్మాత్తుగా-

"మీరు తాటిచెట్టు చదివారా?" అని ప్రశ్నించాడు.

నాకు మతిపోయింది.

'వీడిల్లు బంగారంగానూ... తాటిచెట్టు చదవడమేమిటీ? ఇంకా తాటిచెట్టు ఎక్కారా? అంటే సందర్భశుద్ధి ఉన్నా, లేకపోయినా- కనీసం ఆ ప్రశ్న అర్థవంతంగా ఉంటుంది' అనుకున్నాను.

నేను వెర్రిముఖంవేసుకుని, బుర్ర గోక్కోకుండా, ఆ తాటిచెట్టు సంగతేమిటో అతని నోటి వెంటే చెప్పిద్దామనుకొని, 'ఎలా సమాధానమిస్తే బాగుంటుందా...' అని ఆలోచిస్తున్నాను.

ఇంతలో... నా పాలిటి దైవమల్లే వచ్చాడు కంపోజిటర్- చేతిలో ప్రూఫ్ కాగితం పట్టుకొని! ఆ కాగితాన్ని సదరు సబ్-ఎడిటర్ కమ్ రచయిత ముందు పెట్టాడు.

"సార్... ఎక్స్క్యూజ్ మీ- జస్ట్ ఏ మినిట్!" అని నాతో అని, ప్రూఫ్ రీడింగ్‌లో మునిగిపోయాడు అతను.

నేను తాటిచెట్టుని గురించిన ఆలోచనలో మునిగిపోయాను.

అతడు ఆ ప్రూఫ్‌ని దిద్దుతున్నంతసేపూ 'చుప్.., చుప్...'మంటూ పెదవి విరుస్తూ, అస్పష్టంగా గొణుక్కుంటూ దిద్దసాగాడు. ప్రూఫ్ రీడింగ్ సాగుతున్న కొద్దీ అస్పష్టంగా ఉన్న సణుగుడు అంతకంతకీ స్పష్టమై, సుస్పష్టమై చివరికి పరాకాష్ఠ నందుకుంది.

"ఏమి కంపోజింగయ్యా ఇది? ఎన్ని మాట్లు చెప్పినా ఒకటే తప్పులా? చెప్పి చెప్పి నా నోరు పడిపోతోంది. ఊ... తీసుకెళ్లు- కరెక్షన్స్ త్వరగా చేసి మళ్ళీ ప్రూఫ్ పంపించు..." అంటూ తెలుగు సినిమాల్లో అత్తగారిలాగా... అంటే- శేషమాంబ లేక సూర్యకాంతం మోడల్లో, మాటలకి తగ్గ హస్త, ముఖ భంగిమలని ప్రదర్శిస్తూ విరుచుకుపడ్డాడు.

పాపం... ఆ కంపోజిటర్ కూడా సినిమాల్లో కోడలులాగా నోరెత్తకుండా, తల దించుకుని వెళ్లిపోయాడు.

ఆ 'ప్రూఫోపాఖ్యానం' కళ్ళారా చూస్తున్నా, నా మనస్సు మాత్రం- తాటిచెట్టు చుట్టూ తిరుగుతూనే ఉంది.

'ఒకవేళ నేను అగ్రికల్చర్ స్టూడెంటనుకున్నాడో! లేదా తాను అగ్రికల్చర్ స్టూడెంటేమో! ఏ స్టూడెంటైనా ఫలానా దానిని గురించి అడగదలుచుకుంటే, హాయిగా ఏ మామిడి చెట్టునో, కనీసం ములగ చెట్టుని గురించో అడగకుండా, మధ్యది ఈ దిక్కుమాలిన తాటి చెట్టును గురించి అడుగుతాడేమిటి? కొంపదీసి నేనేమైనా కల్లు తాగుతాననుకున్నాడా ఏమిటి? అనుకుంటే మాత్రం- సభ్యత లేకుండా ఇలా అడగడమేమిటి?'... పరిపరి విధాల పోతున్నాయి నా ఆలోచనలు. అవి మాత్రం తాటిచెట్టుకంటే చాలా ఎత్తుగా పోతున్నాయి.

"చూడండి సార్... నేను చేసేది సబ్ ఎడిటర్ ఉద్యోగం. నాలాంటి వాళ్ళు ఇక్కడ ఇంకా అరడజన్ మంది ఉన్నారు. మా ఎడిటర్‌గారికి మాత్రం నేనంటే చచ్చేటంత నమ్మకం. అన్నీ నన్నే చూడమంటారు. నా మొదటి రచన చదవడంతోనే, ఆయన నన్ను స్వయంగా పిలిపించారు. ఈ ఉద్యోగం ఇస్తానన్నారు. నేను తటపటాయిస్తూంటే, బలవంత పెట్టి ఒప్పించారు. పేరుకి ఆయనే ఎడిటర్ కాని, అన్నీ నేనే చూసేది. మనం ఇంత బాధ్యతతో పనిచేస్తున్నామా... చూడండి- ఈ పనివాళ్ళు!? లక్షసార్లు చెప్పాను- కంపోజింగ్ ఎంతో నీట్‌గా వుండాలని, ఎలా ఉండాలో..! అబ్బే... ఒక్కడు కూడా మాట వినిపించుకోడండీ!" అంటూ అనర్గళంగా, నయాగరా జలపాతంలాగా వాగ్ధరిని వదిలేశాడు.

ఆయన మాటలతో తిరిగి ఈ లోకంలోకి వచ్చాను.

కంపోజిటర్ ధర్మమా... అని తాటిచెట్టు పీడ వదిలింది కదా- 'బ్రతుకుజీవుడా...' అని సంతోషిస్తూ, మళ్లీ అది చుట్టుకోకుండానే జారుకుందామని, "సార్... నేను వెళ్లొస్తాను. ఇంకోసారి కలుస్తాను..." అంటూ సగం లేచాను.

"అమ్మమ్మ.. రాక రాక వచ్చారు. కాఫీ అయినా త్రాగకుండా మీరు వెళ్తానంటే ఎలా? అసలు మనం ఏమీ మాట్లాడుకోందే?" అంటూ కాలింగ్‌బెల్ నొక్కాడు.

బాయ్ రాగానే రెండు కాఫీలు పట్రమ్మని ఆర్డరు ఇచ్చాడు.

'చచ్చాంరా దేవుడా! ఇంక ఈ శిక్ష నాకు తప్పదు. తాటిచెట్టు సంగతి తేల్చందే నన్ను ఒదిలేట్టు లేడు. ఎరక్కపోయి చిక్కబడ్డాను' అనుకుంటూ తిరిగి కుర్చీలో కూలబడ్డాను.

"ఆ... ఇంతకీ మీరు చెప్పనేలేదు- తాటిచెట్టు చదివారో, లేదో?" అంటూ మళ్లీ అందుకున్నాడు అతను.

'అరి... వీడిల్లు బంగారంగాను- ఈ పీడాకాలపు తాటిచెట్టు వదిలేట్టు లేడే!?' అని మనస్సులోనే అనుకుని పైకిమాత్రం ముక్తసరిగా-

"లేదండీ..!" అన్నాను.

"తాటిచెట్టు చదవలేదూ? వేసిన కాపీలన్నీ నెల తిరగకుండానే అమ్ముడై పోయాయండీ! ఎంత గొప్ప సమీక్ష వచ్చిందనుకున్నారు!? ఈమధ్య అనేకమంది నిర్మాతలు దానిని సినిమా తీస్తామంటూ, హక్కులు అమ్మమంటూ నా చుట్టూ తిరిగిపోతున్నారు. ఇంకా ఎవరికి ఇవ్వాలో నిర్ణయించుకోలేదు. నిన్నొకాయన వచ్చి డైలాగ్స్ కూడా నన్నే రాయమన్నాడు. ఆయనకు ఇస్తే బాగుంటుందేమోనని ఆలోచిస్తున్నాను..." అన్నాడు ఆ రచయిత ఒక్కబిగిన.

అప్పటికి నాకు అర్థమైంది- ఆ తాటిచెట్టనేది... ఈ మహానుభావుడు రాసిన ఒక నవలారాజం అని! ఇంక ఫర్వాలేదు... సమాధానం చెప్పడానికి ఓ దారి దొరికింది.

"తాటిచెట్టు గురించి చాలా విన్నానండీ. ఎన్నో మంచి సమీక్షలు కూడా చూశాను. ఏదీ... కొందామంటే ఎక్కడా ఒక్క కాపీ కూడా దొరకందే? తీరిక చేసుకుని ఏ లైబ్రరీకన్నా వెళ్లి చదువుతాను" అన్నాను- ముఖానికి నవ్వు పులుముకుని.

"చూశారా... నాకు తెలుసు- మీరు అలా అంటారని..! దానికి ఉన్న డిమాండ్ అటువంటిది. మీలాంటి ఇంటరెస్ట్ ఉన్నవారికి ఒక కాపీ ఇద్దామన్నా, ఒక్క కాపీ కూడా మిగిలి లేదు. ఆ పబ్లిషర్ కేవలం పది కాపీలు మాత్రమే ఇచ్చాడు. నేను కాపీలు ఇయ్యలేదని కొందరు ఆప్తమిత్రులకి నామీద కోపం కూడా వచ్చింది. ఏం చేస్తాను చెప్పండీ... ఎవరికని ఇస్తాను చెప్పండి?" అన్నాడు కట్టలు తెంచుకున్న ఉత్సాహంతో- ఒక పక్క నాకు కాపీ ఇయ్యలేకపోయినందుకు బాధను నటిస్తూ.

"ఆహా... మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలీడం లేదు. పుస్తకం కొనడం అలవాటులేని తెలుగు పాఠకుల చేత... నెల తిరక్కుండానే అన్ని కాపీలనూ కొనిపించింది మీ గ్రంథరాజం! ఒకే మూసలో పోసిన కథలు తీసే మన నిర్మాతల చేత ఒక పురుషుడు రాసిన నవలని చిత్రీకరించాలనే నిర్ణయం చేయించింది మీ పుస్తకం! తెలుగుదేశం మీకు కలకాలం ఋణపడి ఉంటుంది..." అన్నాను వ్యంగ్యంగా.

నా వ్యంగ్యాన్ని ఆయన నిజంగా తీసుకున్నాడు. ఉబ్బితబ్బిబ్బు అయిపోయాడు. "ఏదోనండీ... అంతా మీబోటివారి చలవ!" అంటూ బోలెడు సిగ్గుపడ్డాడు. మళ్లీ అంతటి సిగ్గునుంచీ తేరుకుని, తల బల్లమీద ఆనించి పకపకా నవ్వడం మొదలుపెట్టాడు.

నాకు భయం వేసింది- ఉన్నట్లుండి ఈ మహానుభావుడికి పిచ్చెక్కలేదుకదా... అని.

ఆ నవ్వు తెరల్లోంచి తేరుకుని తలెత్తాడు ఆ మహా రచయిత. నవ్వినవ్వి అతడి కళ్లమ్మట నీళ్ళు వచ్చాయి. "శివయ్య కూడా ఇలాంటి అవస్థలోనే పడ్డాడండీ. అది జ్ఞాపకం వచ్చి నవ్వు వచ్చింది" అన్నాడు. మళ్లీ వస్తున్న నవ్వును ఆపుకుంటూ-

"ఈ శివయ్యే తెలీదూ?" అని ఒక్కసారి సీరియస్‌గా అడిగి, "ఓ... ఐయాం సారీ- మీరు తాటిచెట్టుని చదవలేదన్నారుగా! శివయ్యది అందులో ఒక చక్కని పాత్ర లెండి. ఆ పాత్రని ప్రత్యేకమైన కృషితో చిత్రించాను. అది కలకాలం జీవించే పాత్ర!" అంటూ అర్జునునికి గీతోపదేశం చేసిన శ్రీకృష్ణుడిలాగా సంశయ నివృత్తి చేశాడు.

'మళ్లీ తాటిచెట్టు వచ్చిందిరా దేవుడా..!' అనుకున్నాను. అప్పటికే నాకు తలనెప్పి మొదలైంది. అది అంతకుంతకూ ఎక్కువవుతోంది. వెంటనే ఏ ఆస్ప్రోనో, అనాల్జినో వేసుకుంటేగాని అది తగ్గేట్టులేదు. మళ్లీ లేచి-

"అయ్యా... కాఫీ వచ్చేసరికి ఆలస్యం అవచ్చు. నేను త్వరగా వెళ్లాల్సివుంది. ఇంకోసారి వస్తా... వెళ్లివస్తా!" అన్నాను- ప్రాధేయపూర్వకంగా.

"ఎంతసేపండీ..." అంటూ కూర్చున్నవాడు లేచివచ్చి, "ఈపాటికి బాయ్ వస్తూనే ఉంటాడు. ఫైవ్ మినిట్స్ కూర్చోండి!" అంటూ ఎంతో చనువుగా నా భుజాలు పట్టుకుని కుర్చీలో కూలవేశాడు.

ముళ్ళమీద కూర్చున్నట్లు, భీష్ములవారు అంపశయ్య మీద పడుకున్నట్లు కూర్చున్నాను. బలిపీఠం మీద పశువులాగా ఇరకాట పడసాగాను.., పంజరంలో పక్షిలాగా మనస్సులోనే కొట్టుకోసాగాను.

ఆ రచయిత చేతులు వెనక్కి కట్టుకుని, నా కుర్చీకీ, తన కుర్చీకీ మధ్య తిరగడం మొదలుపెట్టాడు- కాపలాకుక్కలాగా సీరియస్‌గా ముఖం పెట్టి!

"పాపం- శివయ్య ఎంతో అమాయకుడు. ఒకసారి అతను రాసిన నవల గురించి కాలేజీ విద్యార్థులు నవ్వుతాలికి పొగిడితే, అది నిజమే ననుకుంటాడు. అప్పుడొక హాస్య సంఘటన జరుగుతుంది. అది జ్ఞాపకం వచ్చి నవ్వువచ్చింది" అని తిరిగి తన కుర్చీ దగ్గరికి పోయి కూర్చున్నాడు. నేనేమీ మాట్లాడలేదు.

'నిన్ను చూస్తూంటే ఆ శివయ్య సాక్షాత్తూ కన్పిస్తున్నాడు నాయనా...' అని మనస్సులో అనుకున్నాను. తిరిగి ఆయనే అందుకున్నాడు-

"ఆ శివయ్యది ఎటువంటి పాత్ర అనుకున్నారు! కరుడు కట్టిన మంచితనం మూర్తీభవించిన అమాయకత్వం. మనం సినిమాల్లో చూస్తుంటాం చూడండీ- సత్తెకాలపు సత్తెయ్య లాంటి పాత్రలు! అచ్చం అటువంటి రకపు పాత్ర. అసలు నా పాత్రనే సినిమా వాళ్ళు కాపీ కొట్టేవారని నా అనుమానం. ఒక శివయ్య ఏమిటి లెండి... నేను సృష్టించిన పాత్రలన్నీ అటువంటివే!" నిరాఘాటంగా సాగిపోతోంది ఆయన వాగ్ధాటి.

ఇంతలో... నా పాలిటి భగవంతుడిలాగా వచ్చాడు- బాయ్ కాఫీ తీసుకుని!

దానితో ఆ రచయిత వాక్ప్రవాహానికి అడ్డుకట్ట పడింది.

బాయ్ కాఫీని ఇద్దరిముందు వుంచాడు.

"తీసుకోండి..." అంటూ తానొక కప్పు తీసుకుని సిప్ చేస్తూ- "మీరు నా రచనలు ఏమేం చదివారు?" అన్నాడు.

అసలే వేడి కాఫీ... కంగారులో త్రాగడంతో నాలిక చుర్రుమంది. రచయిత ప్రశ్నతో పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్టయింది. నిజానికి- నేను ఆ రచయిత రచనలేవీ చదవలేదు. 'ఇంక తప్పదురా బాబూ...' అనుకుని-

"చాలా చదివానండి..! ఎక్కువ కథలు చదవడంతో పేర్లు జ్ఞాపకం లేవు" అన్నాను.

రచయిత ఉత్సాహంగా "ఆ... ఆ... చదివేవుంటారు! చదవకుండా ఎలా ఉంటారు లెండి!? 'కాకిగోల' చదివారనుకుంటాను... 'కర్మఫలం' కూడా తప్పక చదివేవుంటారు" అంటూ లిస్టు చెప్పుకుపోసాగాడు.

'కర్మఫలం చదవలేదు నాయనా... అనుభవిస్తున్నాను' అనుకుంటూ- "అబ్బా... చాలా చదివానండీ! ఒక్కమాటలో చెప్పాలంటే- మీ రచనలన్నీ ఔట్‌స్టాండింగ్..!" అన్నాను.

రచయిత ఉత్సాహం కట్టలు తెంచుకుంది. అర్ధనిమీలిత నేత్రాలతో చూస్తూ...

"నాకుతెలుసు- మీరట్లా అంటారని..! ఆ... ఇంతకీ 'మనసు మోకులు' చదువుతున్నారా?" అని అడిగాడు.

నేను తాగుతున్నది కాఫీ అయినా నీళ్ళు నమలసాగాను.

"అదేనండీ- ప్రస్తుతం ఆ పత్రికలో సీరియల్..." అంటూ అదేదో పత్రిక పేరు చెప్పాడు.

"వారం వారం చదవనండీ. అంతా అయ్యాక ఒక్కసారి చదువుతాను. లేకుంటే గ్రిప్ పోతుంది... చూడండి!" అన్నాను.

"అది మంచి పద్ధతే అనుకోండి. కాని ఇది మాత్రం ప్రతివారం చదవండి. అంతా అయ్యాక మళ్లీ చదవవచ్చు. ఇటువంటి సీరియల్ ఇంతవరకూ రాలేదని రోజూ మాకు వేలాది ఉత్తరాలు వస్తున్నాయి..." అన్నాడు ఆయన సీరియస్‌గా.

నా కాఫీ తాగడం పూర్తి అయింది.

ఆయనదీ అయింది.

బ్రతుకుజీవుడా... అనుకొంటూ, "వెళ్లివస్తాను" అంటూ లేచాను.

ఆయన "సరే..!" అన్నాడు.

సంతోషంతో నాలుగడుగులు వేశానో, లేదో- "మాస్టారూ..." అని మళ్లీ పిలిచాడు.

ఇంకా ఏమి రాసిపెట్టి ఉందిరా దేముడా... అనుకుంటూ వెనక్కి తిరిగాను.

"చూడండీ... మనసు మోకులు మాత్రం చదవడం మరచిపోకండి. లేకుంటే జీవితంలో ఒక మంచి నవల చదవలేదని తర్వాత చాలా పశ్చాత్తాపపడతారు!" అన్నాడు సీరియస్‌గా.

"అయ్యో... తప్పక చదువుతానండి!" అంటూ ఇక వెనక్కి తిరిగి చూడకుండా గబగబా బయటకి వెళ్లిపోయాను. రెండు అనాసిన్ మాత్రలు వేసుకుంటేనే కాని తల నొప్పి తగ్గలేదు.

అప్పటినుంచీ ఆ ఆఫీసు వైపు వెళ్లాలంటేనే భయంగా ఉండేది.

*- హాస్యప్రభ... డిసెంబర్ '95*



## అనుభవం నేర్పిన పాఠం

ఒక దిన పత్రికలో "తోటమాలి కావలెను. అభ్యర్థులు తాము ఇంతకుముందు పనిచేసినప్పటి ట్రౌజర్‌లను కూడా వెంట తీసుకురావలెను." అని పడింది.

ఈ వింత ప్రకటనకి విస్తుపోయిన రంగయ్య తన పాత ట్రౌజర్‌ని తీసుకుని వెళ్లాడు.

ప్రకటన చేసిన ముదుసలి ఇంటి యజమానురాలు అతని ట్రౌజర్‌లను చూసి-

"ఈ ఉద్యోగం నీకిస్తున్నాను" అంది.

రంగయ్య ఉండబట్టలేక- "అమ్మా.. ఈ ట్రౌజర్లకీ, నా ఉద్యోగానికీ ఏమిటి సంబంధం?" అని అడిగాడు.

"ఉంది. నీ ట్రౌజర్లు మోకాళ్ల మీద చిరిగాయి. ఇంతకుముందు వచ్చిన ఇద్దరి ట్రౌజర్లూ పిర్రల మీద చిరిగాయి. నాకు నేల మీద వంగి పనిచేసేవారు కావాలి కాని, కూర్చునేవాళ్ళు కాదు" అంది ఆ అనుభవజ్ఞురాలు.